


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

ఆదివారం,
ఏప్రిల్ 6, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-

## ఫేక్ ప్రచారంపై కోర్టుకు: సీఎం రేవంత్


**ఏఐతో నకిలీ ఫొటోలు, వీడియోలపై విచారణకు ఆదేశించాలని న్యాయస్థానాలను కోరదాం**

**కంచ గచ్చిబౌలి భూముల కేసులపై ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

**ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సైబర్ క్రైంను బలోపేతం చేయాలని స్పష్టీకరణ**

**అధునాతన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ టూల్స్ సమకూర్చుకోవాలని సూచన**

**వర్సిటీ భూముల్ని లాక్కున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారంపై ఫైర్**



హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో సృష్టించిన కంచ గచ్చిబౌలి భూముల వివాదం తరహాలో ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో సైబర్ క్రైం విభాగాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఏఐతో తయారైన ఫేక్ కంటెంట్‌ను పసిగట్టేలా అధునాతన ఫోరెన్సిక్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను సమకూర్చుకోవాలని సూచించారు. సమాజాన్ని తప్పు దోవ పట్టించేలా ఉన్న ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయస్థానాలకు విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టుల్లో ఉన్న కేసులపై సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయిలో సమీక్షించారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాక్కున్నట్లుగా సోషల్ మీడియాలో కృత్రిమంగా వివాదం సృష్టించడంపై ఈ భేటీలో ఆందోళన వ్యక్తమైంది.

**ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా...**

'ఏఐ ద్వారా ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా వీడియోలు, ఫొటోలు సృష్టించి కొందరు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయడంతో కంచ గచ్చి'చిలి భూముల వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారితీసింది. వాస్తవాలు వెల్లడించేలోగా అబద్ధాలు సోషల్ మీడియాలో దేశమంతా వైరల్ కావడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఏకంగా నెమళ్లు ఏడ్చినట్లు ఆడియోలు, బుల్డోజర్లకు జింకలు గాయపడి పరుగులు తీసినట్లు

(మిగతా 2వ పేజీలో)



## చేతగాని పాలనతో తెలంగాణ అగాధం

**బిఆర్ఎస్‌కు ఉన్న కమిట్‌మెంట్ మరే పార్టీకి లేదు**

**ఉద్యమస్ఫూర్తితో తెలంగాణను అగ్రగామిగానిలిపాం**

**రజతోత్సవ సభపై నేతలో చర్చలో కెసిఆర్**

గజ్వేల్,ఏప్రిల్5 : తెలంగాణలో పాలన చేతకాక కాంగ్రెస్ రాష్ట్రాన్ని అగాధంలోకి నెట్టిందని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అన్నారు. తెలంగాణ బాగోగులపై బీఆర్ఎస్‌కు ఉన్న ఆవేదన మరో పార్టీకి లేదని కేసీఆర్ తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన ఉద్యమ స్ఫూర్తి బీఆర్ఎస్ సొంతమని, దశాబ్దాలుగా పోరాటం చేసిన నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయిన తెలంగాణ సమాజానికి స్వరాష్ట్ర చైతన్యాన్ని, స్ఫూర్తిని నింపామన్నారు. రాష్ట్ర సాధనకు శాంతియుత పఃతాలో పోరాటాలు నడిపిన ఘన చరిత్ర బీఆర్ఎస్‌ది అని చెప్పారు. తొమ్మిదిన్నరేండ్లు జనరం జకంగా పాలించి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ, రజతోత్సవ మహాసభ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల ముఖ్య నేతలతో పార్టీ అధినేత కే చంద్రశేఖర్ రావు అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఎర్రవెల్లిలో నివాసంలో జరిగిన సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న వివిధ సమస్యలను పార్టీ అధినేతకు బీఆర్ఎస్ నేతలు వివరించారు. గ్రామాల్లో పాలన కుంటుపడిందని, మెయింటెనెన్స్ లేక ట్రాక్టర్లు మూలనపడ్డాయని నేతలు చెప్పారు. సఫాయి కార్మికులకు జీతాలు ఇవ్వలేక పారిశుధ్యం పడకేసిందని తెలిపారు. అధికారంలోకి కోసం అలవిగాని హామీలు ఇచ్చి బూటకపు గ్యారంటీలతో వంచించిన కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని నేతలు చెప్పారు. బీఆర్ఎస్ తెచ్చిన పథకాలు అమలు చేయడం లేదని మండిపడుతున్నారని.. అలాగే రాష్ట్రంలోని పరిస్థితులపై కేసీఆర్‌కు నేతలు వివరించారు. అనంతరం కేసీఆర్ ఎంతో సహనంతో, ఓర్పుతో తీసుకున్న నిర్ణయాలు, కార్యాచరణను నేతలకు వివరించారు. వ్యవసాయంతో పాటు– సబ్బండ వర్గాలకు చేసిన సేవ మహోన్నతమైందని.. ప్రజలే కేంద్రకంగా, అభ్యున్నతే ధ్యేయంగా పని చేయడం బీఆర్ఎస్ పార్టీకే సాధ్యమన్నారు. తాము ఏం కోల్పోయామో ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అర్థమైందని.. తెలంగాణ అంటే ఇతరులకు పొలిటికల్ గేమ్.. బీఆర్ఎస్‌కు

(మిగతా 2వ పేజీలో)



## ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు అదృశ్యం


ఇంకా లభించని ఆ ఆరుగురి ఆచూకీ

విజయవాడ వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు



## టీటీడీ చైర్మన్‌కు కేంద్ర మంత్రి సంజయ్ లేఖ

కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేయించాలంటూ లేఖ



## భద్రాద్రిలో నేడు సీతారామ కల్యాణం..

ఉదయం 10.30గంటలకు ప్రారంభం కానున్న కళ్యాణోత్సవం



## డిసెంబర్‌లోగా 50 టీఎంసీల నిల్వ!

**ఆలోగా 'పాలమూరు' తొలివిడత పనులు పూర్తి చేయాలి**

**సమీక్షలో మంత్రి ఉత్తమ్ ఆదేశాలు**

## వక్ఫ్ తరవాత క్రిష్టియన్లు టార్గెట్

**కాథలిక్ చర్చిల ఆస్తిపై ఆర్ఎస్ఎస్ కన్ను**

**సమిష్టి ఎదుర్కోవాల్సిందే : రాహుల్ ట్వీట్**



న్యూఢిల్లీ,ఏప్రిల్ 5 : వక్ఫ్ బిల్లు తరవాత ఇప్పుడు ప్రభుత్వం దృష్టి క్రిష్టియన్ మైనార్టీలపై పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. క్రైస్త్రవ మతమే ఆర్ఎస్ఎస్ తదుపరి టార్గెట్ అని అన్నారు. కాథలిక్ చర్చిలు దేశంలోనే అత్యధిక భూములు (మిగతా 2వ పేజీలో)

## ప్రధాని మోదీకి శ్రీలంక అత్యున్నత పురస్కారం


**మిత్ర విభూషణ్ ఇచ్చి సత్కరించిన అనురకుమార డిసనాయక**



న్యూఢిల్లీ,ఏప్రిల్5 : శ్రీలంక అత్యున్నత పురస్కారం మిత్ర విభూషణ్‌ను ప్రధాని మోదీ అందుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు అనుర కుమార డిసనాయక.. ఆ అవార్డుతో శనివారం మోదీని సన్మానించారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ కీలక పాత్ర పోషించినట్లు శ్రీలంక అధ్యక్షుడు తెలిపారు. శ్రీలంకలో అత్యున్నత పౌర పురస్కారం అయిన మిత్ర విభూషణ్ అవార్డును 2008లో ప్రారంభించారు. ఆ నాటి అధ్యక్షుడు మహింద రాజపక్స ఈ అవార్డును నెలకొల్పారు. గతంలో మాల్దీవుల అధ్యక్షుడు మౌమూన్ అబ్దుల్ గయూమ్, పాలస్తీనా నేత యాసర్ అరాఫత్

(మిగతా 2వ పేజీలో)

# ఫేక్ ప్రచారంపై కోర్టుకు: సీఎం రేవంత్



నకిలీ ఫొటోలు, వీడియోలు తయారు చేశారు. ప్రముఖులు సైతం వాటిని నిజమని నమ్మి సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు పెట్టడంతో అబద్ధాలకు ఆజ్యం పోసినట్లయింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ధ్రువ్ రాఠీ, సినీ ప్రముఖులు జాన్ అబ్రహం, దియా మీర్జా, రవీనా టండన్ లాంటి వాళ్లంతా ఫేక్ ఫొటోలు, వీడియోల పోస్టులను చేసి సమాజానికి తప్పుడు సందేశం చేరవేశారు. ఈ భూములపై తొలుత నకిలీ వీడియో పోస్ట్ చేసిన జర్నలిస్ట్ సుమిత్ ఝా కాసేపటికే పోస్టును తొలిగించి క్షమాపణ చెప్పారు. మిగతా ప్రముఖులెవరూ ఈ నిజాన్ని గుర్తించకుండా అదే ఫేక్ వీడియో ప్రచారం చేశారు’అని అధికారులు సీఎంకు వివరించారు.

**ఏఐతో ప్రజాస్వామ్య వ్యవస్థలకు ముప్పు: పోలీసులు**

‘కంచ గచ్చిబౌలిలో ఏఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పెను సవాల్ విసిరింది. భారత్%-%పాక్, భారత్%-%చైనా సరిహద్దుల్లో వివాదాలు, ఘర్షణలకు దారితీసేలా ఇదే తీరిలో సున్నితమైన అంశాల్లో ఏఐతో ఫేక్ కంటెంట్ సృష్టిస్తే భవిష్యత్తులో యుద్ధాలు జరిగే ప్రమాదం ఉంటుంది. ఏఐతో తయారు చేసే ఫేక్ వీడియోలు, ఫొటోలు కరోనా వైరస్‌ను మించిన మహమ్మారి లాంటివి’అని పోలీసు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**అప్పుడు లేని వివాదం ఇప్పుడెందుకు?**


‘కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 25లోని భూముల్లో గత 25 ఏళ్లలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. ఐఎస్‌బీతోపాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, ప్రైవేటు భవంతులు, అపార్టుమెంట్లు, హైదరాబాద్ యూనివర్సిటీ భవనాలు నిర్మించారు. వాటిని నిర్మించేటప్పుడు ఎలాంటి వివాదాలు, ఆందోళనలు జరగలేదు’అని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. అప్పుడు వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు కూడా లేవన్నారు. అలాంటప్పుడు అదే సర్వే నెంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైందన్న అంశం సమావేశంలో చర్చకు వచ్చింది.

# చేతగాని పాలనతో తెలంగాణ అగాథం

మాత్రం ఒక టాస్క్ అన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, బీఆర్ఎస్ హయాంలో మండు వేసవిలోనూ చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకాయని.. కాంగ్రెస్ పాలనలో జీవాలకు నీళ్లు దొరకని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నీళ్లందక ఎండిన వరి పంటలను పశువుల మేతకు వదిలేస్తున్న దయనీయ స్థితిపై కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అసమర్థత మూలంగానే రైతులకు ఈ దుస్థితి దాపురించిందని కేసీఆర్ వాపోయారు. పల్లె, పట్టణ ప్రగతితో దేశ రాష్ట్ర, గ్రామీణ ఆర్థిక ప్రగతికి పట్టు-గొమ్మలుగా పరిఢవిల్లిన పల్లెలు.. నేడు కనీస ఆదరణ లేక కునారిల్లుతుండడంపై ఆవేదన చెందారు. ఇవాళ రాష్ట్రం ఎక్కడబోతే మాకేంది.. ప్రజలు ఏమైతే మాకేంది అన్న తీరున స్వార్థ రాజకీయ, అధికారమే పరమావధిగా కాంగ్రెస్ నాయకులు పని చేస్తున్నారన్నారు. ఇదే తెలంగాణ ప్రజల పాలిట శాపంగా మారిందని, కొత్త రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడిపినప్పుడు అన్నిరంగాల్లో అంధకార పరిస్థితులు.. ముఖ్యంగా విద్యుత్ రంగం పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేదని.. కరెంటు- తక్కువైతే ఇతర రాష్ట్రాల గిడ్ తీసుకునే పరిస్థితి ఉందన్నారు. అలాంటి పరిస్థితుల్లో పట్టు-దలతో తొమ్మిదినెలల్లో నేషనల్ గ్రిడ్ నిర్మించుకొని.. రాష్ట్రాన్ని కరెంటు- కష్టాల నుంచి గ-÷-టటె-క్కించుకున్నామన్నారు. 24గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందుబాటు-లోకి తెచుకున్నామని గుర్తు చేశారు. ఇదంతా తెలంగాణ ప్రజలపట్ల ఉద్యమ పార్టీకి ఉన్న ప్రేమాభిమానంతోనే సాధ్యమన్నారు. 7మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని 20వేల మెగావాట్లకు పెంచుకున్నామని, దీనికి తోడు బీఆర్ఎస్ ప్రభుత్వ కృషితో అందుబాటు-లోకి 2400 మెగావాట్ల విద్యుత్ వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విద్యుత్‌ను ఎందుకు అందించలేకపోతుందో అర్థంకావడం లేదన్నారు. ఇది కేవలం అసమర్థతేనని తెలుస్తుందని.. తీసుకున్న ప్రతి నిర్ణయంతో ప్రజలతో చీత్కారాలకు గురవడమే కాకుండా ప్రజలకు మంచి చేయాలన్న సోయి ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయమన్నారు. రైతులపట్ల ప్రేమ, వ్యవసాయంపై అవగాహన ఉంటే పాలనా ప్రాధాన్యతలు అర్థమవుతాయన్నారు. యంత్రాంగంపై పట్టు-సాధించి ప్రజా సంక్షేమంపై రాజీలేని పాలన అందించొచ్చన్నారు. సమావేశంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే విజయ్ భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, రామ్మోహన్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, గువ్వల బాలరాజు, జైపాల్ యాదవ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ ఆంజనేయ గౌడ్, హనుమంతు నాయుడు, గట్టు- యాదవ్ పాల్గొన్నారు.

# భద్రాద్రిలో నేడు సీతారామ కల్యాణం

### ఉదయం 10.30గంటలకు ప్రారంభం కానున్న కళ్యాణోత్సవం



భద్రాద్రి కొత్తగూడెం : నేడు భద్రాచలంలో అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణం జరగనుంది. ఇందులో భాగంగా రాములోకి కళ్యాణ మహోత్సవానికి ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉదయం 9:30 గంటల తర్వాత శంఖు, చక్ర, ధనుర్బాణాలను ధరించి సీతమ్మతో కూడిన రాముడి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పల్లకీలో వెలుపలకు తీసుకొస్తారు. కల్యాణ వేదిక మీదకు వెళ్తున్న సీతారాములకు భజంత్రీలు, కోలాటం, సంప్రదాయ నృత్యాలతో భక్తజనం స్వాగతం పలుకుతారు. జై శ్రీరామ్ నినాదాల నడుమ మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి స్వామి, అమ్మవార్లు చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు కల్యాణ క్రతువు మొదలవుతుంది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. సీతారాముల కళ్యాణానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి పట్టువస్త్రాల్ని సమర్పించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున, శృంగేరీ పీఠంలతో పాటు భక్తరామదాసు, తూము నర్సింహదాసు వంశస్తుల తరఫున వధూవరులకు పట్టు వస్త్రాల సమర్పణ ఉంటుంది.

**అభిజిత్ లగ్నంలో..**

చైత్రశుద్ధ నవమి నాడు అభిజిత్ లగ్నంలో శ్రీరాముడి కల్యాణం నిర్వహించడం ఆచారంగా వస్తోంది, సాధారణంగా నవమి రోజున అభిజిత్ లగ్నం మధ్యాహ్నం 12 గంటలకు కాస్త అటుఇటుగా రావడం పరిపాటి. ముహూర్త లగ్నం రాగానే వధూవరులైన సీతారాముల తలలపై జీలకర్ర, బెల్లం ఉంచుతారు. ఆ తర్వాత శ్రీరామదాసు చేయించిన మూడు తాళిబొట్లు ఉన్న మంగళసూత్రానికి పూజలు నిర్వహిస్తారు. అనంతరం మూడు బొట్లు ఉన్న తాళిని సీతమ్మ వారి మెడలో కట్టడంతో కల్యాణ వేడుకలో కీలక ఘట్టం ముగుస్తుంది.

**భద్రాచల వీధుల్లో వధూవరుల ఊరేగింపు..**

తలంబ్రాల కార్యక్రమం ముగిసిన సీతారాములకు తర్వాత తాత్కాలిక నివేదన చేయిస్తారు. నివేదన అనంతరం సీతమ్మ చీరకు, రామయ్య పంచె/ధోతితో కలుపుతూ బ్రహ్మముడి వేస్తారు. అనంతరం మంగళ హారతి అందిస్తారు. బ్రహ్మముడి అనంతరం కల్యాణం ముగించుకున్న సీతారాములను వేడుకగా పల్లకీలో భద్రాచల వీధుల్లో ఊరేగిస్తూ ఆలయంలోనికి తీసుకెళ్తారు.

# అభివృద్ధిని కాంక్షించే వారు బీజేపీకి ఓటేయ్యండి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్5: తమకు సంఖ్యా బలం లేదని అందరూ అంటున్నారని.. కానీ అభివృద్ధిని కాంక్షిచే వారు బీజేపీకే ఓటు వేయబోతున్నారని బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. శనివారం కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఇక అధికారంలో ఎవరు ఉన్నా మజ్లిస్‌కు హైదరాబాద్ రాసి ఇవ్వడం అలవాటుగా మారిందన్నారు. అందులో భాగంగానే ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో ఎవరు ఉంటే వాళ్లతో అంటకాగి హైదరాబాద్‌ను దోచుకోవడం ఎంఐఎంకు పరిపాటి అయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి ఎంఐఎం కోటలు బద్దలు కొడతామని స్పష్టం చేశారు. సంఖ్యాబలం ఉంటే బీజేపీనే గెలిచేదని.. సంఖ్యా బలం లేదు కాబట్టే ఓటింగ్ జరుగుతోందన్నారు. ఈ ఎన్నికల్లో 120 మంది ఓటర్లు ఆచితూచి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. మజ్లిస్ పార్టీని పెంచి పోషిస్తున్నాయని ఆరోపించారు. మజ్లిస్ పార్టీ కనుసైగలో ఈ రెండు పార్టీలు నడుస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రెండూ కూడా ఎంఐఎం పార్టీ అడుగులకు మడుగులు ఒత్తుతూ పెంచి పోషిస్తున్నాయన్నారు. మజ్లిస్‌కు ఓటేస్తే ప్రజలెవరూ కూడా క్షమించరని అన్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. ఈసారి కచ్చితంగా హైదరాబాద్ నగరంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని.. మేయర్ పీఠం మీద కూర్చోబోయేది భారతీయ జనతా పార్టీనే అని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎన్నికలకు, జీహెచ్ఎంసీ ఎన్ని కలకు సంబంధం లేదని అన్నారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా దేశంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా, హిందువులకు, హిందూ దేవుళ్లకు వ్యతిరేకంగా ఉపన్యాసాలు ఇచ్చే పార్టీ మజ్లిస్ పార్టీ అంటూ మండిపడ్డారు. గతంలో హైదరాబాద్‌లో అనేక సార్లు మతకలహాలు ప్రేరింపించిందన్నారు. అలాంటి మజ్లిస్ పార్టీ అభ్యర్థిని ఏకగ్రీవం చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ చేయకుండా ఉండటం రాజకీయ కుట్రే అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ కూడా ఎంఐఎంకు బానిసత్వంతో ఉండే పార్టీలని వ్యాఖ్యలు చేశారు. ప్రజల ఆకాంక్షలను గౌరవించి మజ్లిస్ పార్టీని ఓడించాలని... బీజేపీ అభ్యర్థిని గెలిపించాల్సిందిగా ఓటర్లను కోరారు. పార్టీలో అంతర్గత విభేధాలు ఉండటం సహజమని చెప్పుకొచ్చారు. అలాంటివి ఏవైనా ఉంటే పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# డిసెంబర్‌లోగా 50 టీఎంసీల నిల్వ!

### ఆలోగా 'పాలమూరు'తొలి విడత పనులు పూర్తి చేయాలి : సమీక్షలో మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి ఎతి్తపోతల పథకం తొలి దశను ప్రాధాన్య ప్రాజెక్టుగా తీసు కుని వచ్చే డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశి ంచారు. ప్రాజెక్టులో భాగమైన నార్లాపూర్ (6.40 టీఎంసీలు), ఏదుల (6.55 టీఎంసీలు), వట్టెం (16.7 టీఎంసీలు), కరివేన (19 టీఎంసీ లు) రిజర్వాయర్‌ల పనులు పూర్తి చేసి డిసెంబర్ నాటికి 50 టీఎంసీల కృష్ణా జలాలను నిల్వ చేసుకునేందుకు సర్వం సిద్ధం చేయా లని ఆదేశించారు. ప్యాకేజీ-3 కింద నార్లాపూర్-ఏదుల రిజర్వాయర్ల మధ్య కాల్వల పనులను తక్షణమే ప్రారంభించి అక్టోబర్‌లోగా పూర్తి చేయాలన్నారు. నీటిపారుదల శాఖపై శనివారం ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వ హించారు. ప్రియదర్శిని జూరాల జలాశయంలో పూడి కను తొలగించి నిల్వ సామర్థ్యాన్ని 12 టీఎంసీలకు పునరుద్ధరించాలని ఆదేశించారు. ‘శ్రీరామనవమి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం భద్రాచలంలో పర్యటించనున్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు అంచనా వ్యయం సవరణకు పరిపాలనాపర అనుమతులతో తక్షణమే జీవో జారీ చేయండి’అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమీక్షలో ఆదేశించారు. నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాకి ఫోన్ చేసి ఈ విషయాన్ని తెలిపేందుకు అధికారులు ప్రయత్నించగా, ఆయన స్పందించలేదు. సెక్రటరీ ఫోన్ ఎత్తడం లేదని అధికారులు చెప్పగా.. సెక్రటరీ ఇంటికి వెళ్లి ఫైల్‌పై సంతకం చేయించి ఈ రోజే జీవో ఇవ్వాలని ఉత్తమ్ ఆదేశించినట్టు తెలిసింది. శనివారం సెలవు కావడంతో సమావేశానికి సెక్రటరీ రాలేకపోయారని సమాచారం. భద్రాచలం పర్యటనలో సీతారామ ప్రాజెక్టుపై సీఎం రేవంత్ సమీక్ష చేసే అవకాశం ఉంది. ఇన్‌లెట్‌వైపు నుంచే బ్లాస్టింగ్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరం గం ఇన్‌లెట్‌వైపు నుంచి మాత్రమే డ్రిల్లింగ్ బ్లాస్టింగ్ విధా నంలో తవ్వకాలకు అనుమతిస్తామని, మన్నెవారిపల్లి (అచ్చం పేట) వద్ద ఉన్న అవుట్‌లెట్ వైపు నుంచి ఎట్టి పరిస్థితిలో అనుమతించబోమని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

# ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు అదృశ్యం

### ఇంకా లభించని ఆ ఆరుగురి ఆచూకీ

### విజయవాడ వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు

హైదరాబాద్: బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో గల్లంతైన ఆరుగురు కుటుంబ సభ్యులు విజయవాడ వెళ్లినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వారి ఆచూకీ కనిపెట్టేందుకు బోయిన్‌పల్లి పోలీసులు ప్రత్యేక బృందాన్ని విజయవాడ పంపించారు. ఆరుగురిలో ఒక్కరి వద్దే సెల్‌ఫోన్ ఉండగా అది కూడా స్విచ్చాఫ్ కావడంతో వారి ఆచూకీ కనుక్కోవడం కొంత కష్టంగా మారినట్లు తెలుస్తోంది. బోయిన్‌పల్లికి చెందిన మహేశ్ తన భార్య ఉమ, ముగ్గురు పిల్లలు రిషి, చైతు, శివన్, మరదలు సంధ్యతో కలిసి ఈ నెల 1న ఇంటి నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయారు. రెండు రోజుల అనంతరం మహేశ్ బావమరిది బిక్షపతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ మొదలు పెట్టారు. మహేశ్ కుటుంబం 1వ తేదీన బోయిన్‌పల్లి నుంచి నేరుగా, ఇమ్లీబన్‌కు చేరుకుని అక్కడ విజయవాడకు వెళ్లే గరుడ బస్సు ఎక్కినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. మరుసటి రోజు ఉదయం విజయవాడలో దిగినట్లు కూడా సీసీ కెమెరాల్లో రికార్డయింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బాలంరాయి పంప్‌హౌజ్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న మహేశ్, తోటి ఉద్యోగులతో ముభావంగానే ఉండేవాడని తెలుస్తోంది. మహేశ్ కుమారుడు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో తీర్థయాత్రలకు వెళ్లి ఉండచ్చొని మహేశ్ కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు వీరి గల్లంతుకు గల ఇతరత్రా కారణాలు ఏవైనా ఉంటాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఇతర కుటుంబ సభ్యుల నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నారు. గల్లంతయిన వారి ఆచూకీ తెలిశాకే పూర్తిస్థాయిలో వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# టీటీడీ చైర్మన్‌కు బండిసంజయ్ లేఖ



కరీంనగర్, ఏప్రిల్5: కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణం కోసం ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారని, యుద్ధప్రాతిపదికను పనులు చేయించాలంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు కేంద్రమంత్రి బండిసంజయ్ లేఖ రాశారు. దేశవ్యాప్తంగా ధర్మ ప్రచారంతో పాటు హిందూ దేవాలయాల నిర్మాణ అభివృద్ధి టీటీడీ చేస్తున్న కృషి భేష్ అని మెచ్చుకున్నారు. ధూప-దీప నైవేద్యాలకు నోచుకోని అనేక దేవాలయాలను ఆదుకోవడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. ప్రధాని మోదీ మద్దతుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాబోయే రోజుల్లో ఏపీ అభివృద్ధిని చూడబోతున్నామన్నారు. టీటీడీ చైర్మన్ నాయకత్వంలో భక్తులంతా భక్తిభావంతో కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులను పొందుతున్నారని తెలిపారు. తిరుమలలో చేపట్టిన చర్యలు భక్తుల నుంచి విశేషమైన ప్రశంసలు పొందుతున్నాయని చెప్పారు. కరీంనగర్‌లో చేపట్టిన టీటీడీ ఆలయ నిర్మాణానికి సహకరించాలన్నారు. 2023లోనే కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి అనుమతి లభించిందని తెలిపారు. ఇందులో కరీంనగర్ పద్మానగర్‌లో 10 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. అదే ఏడాది మే 31న కరీంనగర్‌లోని 10 ఎకరాల స్థలంలో రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమి పూజ కూడా జరిగిందని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. టీటీడీ ఆలయ నిర్మాణం కోసం కరీంనగర్ సహా పొరుగు జిల్లాల ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు.

# వక్ఫ్ తరవాత క్రిష్టియన్లు టార్గెట్

కలిగి ఉన్నాయని ఆర్ఎస్ఎస్ మౌత్‌పీస్ వెల్లడించిందని అన్నారు. వక్ఫ్ బిల్లుతో ముస్లింలపై దాడి జరుగుతుందని చెప్పాను. ఇప్పుడది భవిష్యత్తులో ఇతర మతాలను టార్గెట్ చేయడానికి మార్గం సుగమం చేస్తోంది. క్రిస్టియన్లను ఆర్ఎస్ఎస్ టార్గెట్ చేయడానికి ఎంతో సమయం పట్టకపోవచ్చు. అలాంటి దాడుల నుంచి మన ప్రజలను కాపాడుకోవాలంటే రాజ్యాంగం ఒక్కటే మార్గం. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మనందరి సమష్టి బాధ్యతని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు-2025ని పార్లమెంట్ ఆమోదించింది. అయితే, ఆమోదం పొందినప్పటికీ దీనిపై రచ్చ ఆగడం లేదు. కాంగ్రెస్, ఇతర ఇండీ కూటమి పార్టీల నేతలు వక్ఫ్ బిల్లును ఛాలెంజ్ చేస్తూ సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. ఈ వివాదాల నేపథ్యంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. వక్ఫ్ తర్వాత ఆర్ఎస్ఎస్ కాథలిక్ చర్చిలను, క్రైస్తవ సమాజాన్ని టార్గెట్ చేయబోతోందని హెచ్చరించారు. ఆర్ఎస్ఎస్ వెబ్‌సైట్ వ్యాసంలో భారతదేశంలో కాథలిక్ సంస్థలకు 7 కోట్ల హెక్టార్ల భూమి ఉందని, అవి అతిపెద్ద ప్రభుత్వేతర భూ యజమానులుగా ఉన్నాయని పేర్కొందని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వక్ఫ్ బిల్లు ఇప్పుడు ముస్లింలపై దాడి చేస్తుందని నేను చెప్పాను. కానీ భవిష్యత్తులో ఇతర వర్గాలను లక్ష్యంగా చేసుకోవడానికి ఇది ఒక ఉదాహరణ. కాథలిక్ సంస్థల కింద ఉన్న భూమిలో ఎక్కువ భాగాన్ని బ్రిటిష్ పాలనలో 1927 ఇండియన్ చర్చి చట్టం ద్వారా స్వాధీనం చేసుకుందని ఆరోపించింది. వలసవాద కాలంలో లీజుకు తీసుకున్న భూమిని ఇకపై చర్చి ఆస్తిగా గుర్తించబోమని పేర్కొన్న 1965 ప్రభుత్వం ఉత్తర్వులను ఉదహరించింది. అంతకుముందు వక్ఫ్ బిల్లు ముస్లిం హక్కుల్ని కాలరాస్తుందని కాంగ్రెస్ ఆరోపించింది. ఇదిలా ఉంటే, కేరళ కాథలిక్ బిషప్స్ కౌన్సిల్ వక్ఫ్ బిల్లుకు మద్దతు తెలియజేయడం గమనార్హం.

# ప్రధాని మోదీకి శ్రీలంక అత్యున్నత పురస్కారం

అందుకున్నారు. లంక అధ్యక్షుడు దిసనాయకే తనకు మిత్ర విభూషణ్ అవార్డును అందజేయడం గౌరవంగా భావిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఇది 140 కోట్ల మంది భారతీయులకు కూడా గర్వకారణమన్నారు. కొలంబోలోని ప్రెసిడెన్షియల్ సెక్రటేరియేట్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ప్రశంసా పత్రంతో పాటు రజత పతకాన్ని అందజేస్తారు. ఆ సిల్వర్ మెడల్‌లో 9 రకాల లంక ముత్యాలు ఉంటాయి. కమలం, విశ్వం, సూర్యుడు, చంద్రుడు, వరి కంకి గుర్తులు ఉన్నాయి. మెడల్‌పై ధర్మచక్రం.. బౌద్ధ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తుంది.



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు

## మహనీయుని ఆదర్శాలను పునికి పుచ్చుకోవాలి

## లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ



దేవరకొండ ఏప్రిల్ 05 వార్త మిర్రర్ :బాబు జగ్జీవన్ రావ్ మహోన్నత పార్లమెంటేరియన్ అని ఇలాంటి మహనీయుని జన్మదినాలు వర్ధంతి లను జరుపుకోవడంతో పాటు ఆయన ఆదర్శంగా తీసుకోవాల్సినటువంటి అవసరం ఎంతైనా ఉందని దేవరకొండ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ అన్నారు. బాబు జగ్జీవన్ రావ్ 117 వ జయంతిని పురస్కరించుకొని స్థానిక గ్రంథాలయంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ప్రధానిగా కొనసాగిన తరుణంలో బడుగు బలహీన వర్గాల కోసం ఆయన అనేక సంస్కరణలు తీసుకొచ్చారని జాతిపిత మహాత్మా గాంధీ అభిప్రాయాలతో జగ్జీవన్ రామ్ ఎక్కువగా ఏకీభవించారని తెలిపారు అంటరానితనం నిర్మూలించడానికి గాంధీ చేసిన ప్రయత్నాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. బాపూజీ గా ప్రసిద్ధికెక్కిన జగ్జీవన్ రామ్ జాతీయ నాయకుడై స్వాతంత్ర సమరయోధుడుగా సామాజిక న్యాయ పోరాట యోధుడిగా కీర్తి కెక్కి చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. అనగారిన వర్గాలకు దీపమై నిజమైన ప్రజాస్వామ్యవాది విశిష్ట కేంద్రమంత్రి సమర్థ పరిపాల దక్షుడుగా బాబు జగ్జీవన్ రామ్ కొనసాగారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చిలుకూరి నిరంజన్ జెడ్ సి వనం భిక్షమయ్య, గోవిందు కొండయ్య , వనం శ్రీను, నీల బుచ్చయ్య,డాక్టర్ పి జె. సామ్సన్, శిరం దాసు కృష్ణయ్య, నల్ల మాద నారాయణరెడ్డి, కొండూరు ఆంజనేయులు, రేపాక శివ, దినేష్, వేణు గోపాల చారి, హరి, తదితరులు పాల్గొన్నారు.

# పేట శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద మినరల్ వాటర్ ప్లాంట్ కు భూమి పూజ

## - ఐక్యత ఫౌండేషన్ ద్వారా ప్లాంట్ నిర్మాణం

## - సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



కల్వకుర్తి ఊర్కొండ ఏప్రిల్ 5 వార్త మిర్రర్ ప్రతినిధి:–ఊర్కొండ మండలం ఊర్కొండ పేట ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,టాస్క్–సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి స్వామి స్వామిని దర్శించుకోవడం జరిగింది. అనంతరందేవాలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం మేరకు త్రాగు నీటికోసమై దేవాలయ కమిటీ కోరికమేరకు సుంకిరెడ్డి ఐక్యత ఫౌండేషన్ ద్వారా రూ"5,00,000 (బోర్ మోటర్ తో సహా)మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు శనివారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ..తన ఇష్టదైవం శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి స్వామి దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని,అలాగే దేవాలయ కమిటీ విజ్ఞప్తి మేరకు భక్తుల సౌకర్యార్థం ఐక్యత ఫౌండేషన్ ద్వారా వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ చేయడం జరిగిందని,ఎంతో ప్రాముఖ్యత కలిగిన పబ్బతి ఆంజనేయస్వామికి తన వంతు సేవ చేసుకొనే భాగ్యం దక్కడం సంతోషంగా ఉందని,దేవాలయానికి సంబంధించి ఎలాంటి సహకారానికైన ముందుటామని తెలియజేశారు. దేవాదాయ చైర్మన్,పాలక వర్గం సభ్యులు మాట్లాడుతూఅడగగానే గొప్ప మనసుతో స్పందించి మినరల్ వాటర్ ప్లాంట్ మరియు బోర్ మోటర్ ఏర్పాటు చేస్తున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలోదేవాదాయ చైర్మన్ నారాయణ రెడ్డి, ఈ.ఓ సత్య చంద్రారెడ్డి,ఊర్కొండ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాప నిఖిల్ రెడ్డి,పిఎసిఎస్ మాజీ చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి, అయూబ్ పాషా,రమేష్ నాయక్,అబ్దుల్ సమీ, గోపి, శ్రీనివాసులు,యూత్ ప్రెసిడెంట్ ఆదినారాయణ, వహీదోద్దీన్, మనోహర్ రెడ్డి, ఆరిఫ్, పాలకమండలి సభ్యులు ఆలయ అర్చకులు దత్తాత్రేయ శర్మ ,మహేష్, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సన్న బియ్యం ఇస్తున్నది మోదీ ప్రభుత్వమే:



కల్వకుర్తి ఊర్కొండ మార్చ్ 5 వార్త మిర్రర్ ప్రతినిధి:– ఊర్కొండ మండలంలోని ఊర్కొండ పేట గ్రామంలో బిజెపి, బీజేవైఎం ఆధ్వర్యంలో సన్న బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగర్ కర్నూల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు వాగుల్ దాస్ నిరంజన్ గౌడ్ విచ్చేసి ఊర్కొండపేట నర్సంపల్లి గ్రామాలలో రేషన్ షాపులోనీ సందర్శించి ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గత ఐదు సంవత్సరాలుగా కష్టకాలంలో క్లిష్ట పరిస్థితుల్లో కరోనా సమయంలో కూడా పేదలను దృష్టిలో ఉంచుకొని ఉచిత రేషన్ని ప్రవేశపెట్టడం జరిగింది. అదేవిధంగా ఇప్పుడు సన్న బియ్యం ఇవ్వడం జరుగుతుంది. అని ప్రజలకు వివరించారు కేంద్రం ఇచ్చే వాటా రూ"40 రూపాయలు అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే వాటా రూ "10 రూపాయలు అని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఆ తప్పుని కప్పిపుచ్చుకోవడానికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజలను తప్పుదారి పట్టించడానికి ఈ సన్న బియ్యం కార్యక్రమాన్ని చేపట్టారని ఆయన అన్నారు నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలు పత్తి గ్రామంలోని ప్రజలకు తెలుసు అని అన్నారు.మీరు ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పిన వచ్చే స్థానిక ఎలక్షన్ లో బిజెపిదే విజయమని ఆయన స్పష్టం చేశారు.నరేంద్ర మోడీ ఆలోచన ప్రతి పేదవాడి ఆకలి తీర్చాలని కడుపు నిండాలని ఆయన ఆలోచనలో భాగంగానే ఉచిత రేషన్ ప్రవేశపెట్టారు .పేదవాని ఇంట్లో సన్న బియ్యం ఉండాలి పేదవాడి కడుపు నింపాలి ప్రతిరోజు పేదవాడికి పండగ కావాలీ అనేది బిజెపి ఆలోచన అని అన్నారు. ఉచిత రేషన్ సన్న బియ్యం ఇస్తున్న భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీకి ఊర్కొండ పేట నర్సంపల్లి గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువ నాయకులు,టీ అరవింద్ గౌడ్,తెలంగాణ బిజెపి యువ నాయకుడు దివాకర్ గౌడ్,బిజేపిమండల సీనియర్ నాయకులు తాడెం చిన్న,నాగర్ కర్నూల్ జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి రాఘవేందర్,బీజేవైఎం నాయకుడు హరీష్ యాదవ్, పాల్గొన్నారు.

# ధాన్యం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయకుంటే చర్యలు

## హెచ్ఎంటి ధాన్యాన్ని తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిందే

## వేయింగ్ మిషన్లలో ధాన్యానికి వ్యత్యాసం రావద్దు

## కెపాసిటీకి 50 శాతం పైన ధాన్యం కొనాల్సిందే

## సబ్ కలెక్టర్ అమిత్



మిర్యాలగూడ, ఏప్రిల్ :–( వార్త మిర్రర్) ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కింటాకు రూ 2,300 తప్పనిసరిగా చెల్లించాల్సిందేనని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామనీ మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్ అన్నారు. శనివారం స్థానిక సబ్ కలెక్టరేట్ కికాన్ఫరెన్స్ హాలులో జరిగిన మిల్లర్ల, రైతు సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిల్లర్లు అన్ని రకాల ధాన్యంతో పాటు హెచ్ఎంటి ధాన్యాన్ని తప్పనిసరిగా కొనుగోలు చేయాలన్నారు. రైస్ మిల్లుల వద్ద వేయింగ్ మిషన్లలో ధాన్యం వ్యత్యాసం వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఎట్టి పరిస్థితులలో వేయింగ్ మిషన్లు వ్యత్యాసం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మిల్లుల వద్ద ధాన్యం ట్రాక్టర్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా మిల్లు యజమానులు తమ టార్గెట్ (కెపాసిటీ) కు మించి వచ్చిన ధాన్యం ట్రాక్టర్ల లోడును సమీపంలోని మిల్లులకు పంపాలన్నారు. మిల్లుల వద్ద కెపాసిటీ మించి దాన్యం లోడ్లలతో వస్తున్నందున రైతులకు ఇబ్బంది కలగకుండా మిల్లుల వారిగా టోకెన్లు ఆయా తేదీల్లో ఇవ్వాలన్నారు. ప్రతి రైస్ మిల్లు కెపాసిటీలో 50 శాతం తప్పనిసరిగా ప్రతిరోజు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొన్న మిల్లర్లు రైతులకు త్వరితగతిన డబ్బులు చెల్లించాలన్నారు. వేసవి కాలం ఉన్నందున రైస్ మిల్లుల వద్ద మంచి నీటి సౌకర్యం, నీడ కల్పించాలన్నారు. సమావేశంలో తహసిల్దార్లు ఎన్.హరిబాబు, సురేష్, జవహర్ లాల్, పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్ ఎండి.జావిద్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, మిర్యాలగూడ మిల్లర్స్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఘంట సంతోష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటరమణ చౌదరి బాబి, బండారు కుశలయ్య, గుడిపాటి శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# మద్దతు ధరకు వరి కొనని మిల్లర్లు

## నష్ట పోతున్న రైతులు

## పట్టించుకొని అధికారులు

## వరి రైతుల కష్టాలకు న్యాయం ఎప్పుడూ?

## సిపిఎం మండల కార్యదర్శి రవినాయక్



మిర్యాలగూడ ఏప్రిల్ 5:– (వార్త మిర్రర్) రైతులు రక్తం చిందించి పండించిన వరిధాన్యం కనీస మద్దతు ధర (ఎంఎస్పి)కు మించి అమ్ముకోవాల్సిన స్థితిలో ఉండగా, మిల్లర్లు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని దీంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారని సిపిఎం మండల కార్యదర్శి ఎం.రవినాయక్ అన్నారు. శనివారం విలేఖరులతో మాట్లాడుతూ రైతులు గింజగింజను పండించిన వరికి సరైన ధర రాకపోవడం సంబంధిత అధికారులు ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని, కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు అయ్యేలా చూడాలని పేర్కొన్నారు.రైతులు పండించే వరికి మద్దత్తు ధర కంటే అదనంగా అన్ని రకాల వరి ధాన్యానికి బోనస్ ఇచ్చి వ్యవసాయన్ని ఆదుకోవాలని వారు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.రైతన్నకు న్యాయం చెయ్యడమే నిజమైన అభివృద్ధి అన్నారు. రైతు కష్టం వృధా కాకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పెట్టుబడి పెట్టి, కష్టించి పండించిన పంటను తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోందని, ఆర్థిక స్థితిని దెబ్బతీస్తోందన్నారు.అధికారులు పరిస్థితిని పట్టించుకోవడంలో విఫలమైనారన్నారు. ప్రభుత్వం, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే సమస్య మరింత తీవ్రమవుతుందని, రైతులు సంఘటితంగా నిలబడి ధరపై నీఖరమైన పోరాటం చేసే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు.



# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

దేవరకొండ ఏప్రిల్ 05 వార్త మిర్రర్ :బహుజన మహానేత, భారత రాజకీయం, సామాజిక సమానత్వానికి నిలువెత్తు నిదర్శనం అయిన బాబు జగ్జీవన్ రావు గారి జయంతిని పురస్కరించుకొని, ప్రముఖ బహుజన నాయకుడు, న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్ గారి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రావు గారి చిత్రపటానికి పుష్పమాలలు వేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రావు గారు భారతదేశ సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటం ఆదర్శప్రాయుడని, ఆయన్ని స్మరించుకోవడం అనేది భవిష్యత్తు తరాలకు సమానత్వ మార్గాన్ని చూపించడమేనని అన్నారు.ఈ కార్యక్రమంలో బహుజన సంఘాల ప్రతినిధులు అంకూరి నర్సింహ, పొట్టేపాక మురళీకృష్ణ, పేర్ల మహేష్, పంబాల పర్వతాలు, పంది శ్రీరాములు, మద్దిమడుగు మధు, క్రాంతి, శాంతిరాజు, వాల్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# అలరించినా వారంతాపూసాంస్కృతిక కార్యక్రమాలు.

మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ లో ని శిల్పారామం లో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం అభినయ వాణి నృత్యనికేతన్ నాట్య గురువులు శ్రీమతి బాలాత్రిపురసుందరి శిష్య బృందం చే "భజ రామం" శ్రీ రామచంద్రమూర్తి పై వివిధ వాగేయకారులు రచించిన రామ కీర్తనలను సమర్పించారు. రామాయణ శబ్దం, తక్కువేమి మనకు నగుమోము, మా రామచంద్రునికి, శ్రీ రామ జయ రామ, కోదండ రాముడవై, కొలువైఉన్నడే అంశాలకు సంయుక్త, శశికళ, దీక్షితులు, నేత్ర, ప్రియా హాసిని, అంబికా, చరణ్, అనన్య, సంజన, ఇషితా , ఐశ్వర్య, మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. నట్టువాంగం శ్రీమతి బాల త్రిపురసుందరి, గాత్రం శాస్త్రి , మ్రిదంగం రాజగోపాలాచారి, వయోలిన్ శ్రీ శివ కృష్ణ స్వరూప్, వేణువు మురళి, ఎఫెక్ట్స్ శ్రీ జయకుమారాచార్య లు సహకరించారు.



# సభను విజయవంతం చేసిన మాజీ మంత్రులుకు కృతజ్ఞతలు

## - మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్

కల్వకుర్తి కడ్తల్ ఏప్రిల్ 5 వార్త మిర్రర్ ప్రతినిధి:– ఈ నెల 3న తమ ఆహ్వానం మేరకు కడ్తాల్ మండలంలోని ముద్విన్, చరికొండ గ్రామ పంచాయతీలలో పర్యటించి బోయిన్ గుట్ట తండాలో నిర్వహించిన సభను విజయవంతం చేసిన మాజీ మంత్రి సిద్దిపేట శాసన సభ్యులు తన్నీరు హరీష్ రావు తో పాటు మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డిని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ మర్యాదపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వారి నివాసాల్లో కలిసి పూలబొక్కలు ఇచ్చి సన్మానించారు. వారి రాకతో కడ్తాల్ బిఆర్ఎస్ కార్యకర్తల్లో నూతన ఉత్సాహం వచ్చిందని త్వరలోనే జరిగే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా ఏమిటో చాటుతామని తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ ను వారు అభినందించారు సభను విజయవంతంగా నడిపించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ ఎస్టీ కమిషనర్ రాంపాల్ నాయక్ మాజీ సర్పంచ్ లాల్కోట నర్సింహా గౌడ్ నాయకులు అంజి నాయక్ ఈశ్వర్ నాయక్ శ్రీను నాయక్ ప్రశాంత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మహా నేతకు ఘన నివాళులు

మిర్యాలగూడ ఏప్రిల్ 4:– (వార్త మిర్రర్) భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా శనివారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందుపి శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ఆధ్వర్యంలో వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అతి చిన్న వయసులో కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఏకైక వ్యక్తి మాత్రమే కాదనీ 35 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎక్కువ కాలం మంత్రి పదవి చేసిన ఏకైక నాయకుడు కూడా వారేనని అన్నారు.ఆనాటి స్వతంత్ర ఉద్యమం నుంచి వారు నిత్యం బడుగు, బలహీన వర్గాల తరపున పోరాడుతూ ఎంతో మందికి స్ఫూర్తినిచ్చారు. దాదాపు 45 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీకి తమ సేవలు అందించి దేశ అభివృద్ధిలో భాగస్వామ్యులయ్యారని అన్నారు. అలాంటి మహనీయుని జయంతి సందర్భంగా వారికి నివాళులు అర్పించడం వారిని స్మరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెసు నాయకులు, కార్యకర్తలు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# నిజాం నగర్ ప్రభుత్వ బడి-విద్యార్థుల ప్రతిభ

డిండి(గుండ్లపల్లి) ఏప్రిల్ 05 వార్త మిర్రర్ :

తెలంగాణ రాష్ట్రంలోగురువారం నాడు వెలువడిన తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్ష(టిజి సెట్)ఫలితాల్లో గుండ్లపల్లి(డిండి) మండలం నిజాం నగర్ ప్రభుత్వ బడి విద్యార్థులు నాలుగవ తరగతిలో నలుగురు విద్యార్థులు ఉండగా అందరూ విద్యార్థులు వివిధ రకాల గురుకుల పాఠశాలలో సీట్లు సంపాదించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కష్టపడి చదువే విద్యార్థులు ఎక్కడున్నా వారి ప్రతిభను వెలికి తీసే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు.ప్రభుత్వ బడి మన ఊరిలో ఉండగా ప్రైవేటు బడులెందుకు దండగ అని ఉపాధ్యాయులు అన్నారు. ఇట్టి కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమరేందర్ ఉపాధ్యాయుడు రవిలను ప్రతిభ కనబరచిన బి.చందన,ఎమ్. అక్షయ,కె.వినయ్ కుమార్,బి.సాయి వరుణ్ లకు అభినందనలు తెలిపారు.





## బాబు జగ్జీవన్ రామ్ గారి జయంతి సందర్భంగా ఘన నివాళి.

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : స్వాతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త ,

భారత మాజీ ఉప ప్రధానమంత్రి , శ్రీ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని, బీజేపీ నాయకులు పవన్ కుమార్ ఆధ్వర్యంలో హాఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని ఇంజనీర్స్ ఎంక్లేవ్ లో అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది,ఈ సందర్భంగా హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ మహోన్నత వ్యక్తిత్వం కలిగినవారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం తన జీవితాన్ని అర్పించిన మహానుభావులు,గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, పరిపాలన నిపుణుడు, జాతీయ నాయకుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా పనిచేస్తూ అణగారిన తరగతుల అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారు, ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు వేశారు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు బోయిని మహేష్ యాదవ్ , బిజెపి జిల్లా అధికార ప్రతినిధి అజిత్ సేనాపతి, మాజీ కౌన్సిలర్ రమణయ్య , మరియు సీనియర్ నాయకులు, శ్రీనివాస్ యాదవ్ , అశోక్ , రవి ముదిరాజు, పాలం శ్రీనివాస్ ,రాజు ముదిరాజ్ ,నరసింహ యాదవ్ ,నవీన్ పాల్గొన్నారు.



## సోలార్ తో.. విద్యుత్ ఛార్జిలు ఆదా:

## శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : సోలార్ ద్వారా సౌర శక్తిని వినియోగిస్తే భూమిపై కర్బన ఉద్గారాలు తగ్గుతాయని, దానివల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ గారు అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ లోగల ధూబే కాలనీ బాలాజీ నెస్ట్ అపార్ట్మెంట్ లో 8 లక్షల 40 వేల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేసిన 14 కే వి రూఫ్ టాప్ సోలార్ పవరు ప్లాంటుకు గవర్నమెంట్ %=ం%.2,52,000 సబ్సిడీ అందించడం జరిగింది. కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... సహజ వనరులను ఉపయోగించుకోవడం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. తగ్గిపోతున్న వనరుల తరుణంలో సహజ సిద్ధమైన సౌర శక్తిని వాడుకుని సద్వినియోగం చేసుకుంటూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు 14 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ను ఏర్పాటు చేసిన బాలాజీ నెస్ట్ అపార్ట్మెంట్ అసోసియేషన్ వారిని కార్పొరేటర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వీరేశం గౌడ్, మాజీ కౌన్సిలర్ సోమదాస్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, గోపాల్ యాదవ్, సురేష్, శ్రీ సాయి సోలార్ సిస్టమ్స్ అప్పల నాయుడు, బాలాజీ నెస్ట్ అపార్ట్మెంట్ అసోసియేషన్ సభ్యులు ఆంజనేయులు యాదవ్, విజయ్ భాస్కర్, విజయ్ కుమార్, కిరణ్, మురళి, దేవేందర్, ఝాన్సీ, జాషువ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో మృతిచెందిన వీరమల్ల గణేష్ కుటుంబానికి ఆర్థిక సహాయం

## ఆటోనగర్ ఇసుక లారీల యజమానుల సంఘం ఆర్థిక సహాయం అందజేత


యాదాద్రి వార్త ప్రతినిధి గణేష్ సాగర్

వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన ఇసుక లారీ యజమాని వీరమల్ల గణేష్ గారు గత నెల 26వ తారీఖు నాడు అనారోగ్యంతో మరణించడం జరిగింది అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు కాబట్టి వారికి కుటుంబ అవసరాల నిమిత్తం ఆటోనగర్ ఇసుక లారీల యజమానుల సంఘం తరఫున వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర లారీ యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బూడిద నందా రెడ్డి 10,000/వేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేయడం జరిగింది. వాటితో పాటు ఆటోనగర్ ఇసుక లారీల యజమానుల సంఘం సభ్యులందరూ కలిసి మొత్తంగా ?82,500/- జమచేసి ఈరోజు ఆటోనగర్ ఇసుక లారీ యజమానుల సంఘం అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్ చేతుల మీదుగా మృతి చెందిన వీరమల్ల గణేష్ కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శులు లగ్గోని అంజయ్య గౌడ్,కొండె శ్రీశైలం కురుమ,ఉపాధ్యక్షులు దేవనబోయిన మహేష్ యాదవ్,నాయకులు కొత్త లింగస్వామి యాదవ్,సుర్వి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# వైటిపిఎస్ బాధితులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి

## ఆనందంతో భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ , ఏప్రిల్ 5:-( వార్త మిర్రర్)హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కి.శంకర్ నాయక్, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన ఆర్ అండ్ ఆర్ బాధితులకు 112 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేషారూ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ నాకు తోడుగా ఉండి నన్ను గెలిపించుకున్న గిరిజన సోదరులకు గెలిస్తే వారికి న్యాయం జరుగుతుందని నన్ను నమ్మిన బాధితులకు శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలు అందజేయడం చాలా గర్వంగా ఉందని భావోద్వేగానికి గురయ్యారు. గత కొన్ని నెలలుగా ఈ కార్యక్రమం కోసం నిత్యం కృషి చేశామని వెంటనే స్పందించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంత తక్కువ సమయంలో బాధితులకు న్యాయం చేస్తున్నందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.. అలాగే ల్యాండ్ లూజర్స్ కి కూడా త్వరలోనే ఉద్యోగ నియామకాలు కల్పించాలన్నారు. అదేవిధంగా ఫారెస్ట్ భూములు, ప్రభుత్వ భూములు కోల్పోయిన బాధితులకు ఉద్యోగాలు లేక సీఎల్ గా తీసుకోవాలని కోరారు. దామరచర్ల మండలంలో అత్యధికంగా గిరిజనుకు ఉన్నారని వారికి కోసం ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూర్



చేయాలని కోరారు. కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు..



## భువనగిరికి విచ్చేసిన ఎమ్మెల్సీ

## కవితకు స్వాగతం పలికిన- డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండల కేంద్రానికి విచ్చేసిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితకు శాలువాతో సత్కరించి, స్వాగతం పలికిన, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్,బిఆర్ఎస్ శ్రేణులు నల్గొండ మండలం టేకుల సమాజంలో తాగునీరు అండకా చేతికి వచ్చే దశలో వెళ్లిపోయిన పంట పొలాలను పర్యవేక్షించడానికి ఎమ్మెల్సీ కవిత జిల్లాకు వచ్చారు అనంతరం పంట పొలాలను పరిశీలించారు





# ఇది కాలం తెచ్చిన కరువు కాదు.!

# ముమ్మాటికి కాంగ్రెస్ తెచ్చిన కరువే

## జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్

యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం టేకులసోమారంలో సాగునీరు అందక చేతికొచ్చే దశలో ఎండిపోయిన పంట పొలాలను పర్యవేక్షించారు తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ విడిపోయిన పంటలను పుట్టెడు దుఃఖంలో ఉన్న రైతులను చూస్తే గుండె బరువెక్కింది అని అన్నారు.నీటి నిర్వహణ పై అవగాహన లేక దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వం పంట పొలాలను ఎండబెట్టింది అని ఆరోపించారు. రైతులను అరిగోస పెడుతోన్న అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలి పెట్టేదిలేదు.నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని అన్నారు కార్యక్రమంలో భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి, ఎలిమినేటి సందీప్ రెడ్డి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి,జనగం పాండు, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు,గ్రామ శాఖ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు



# ధ్వజస్తంభం ప్రతిష్టాపన ఉత్సవాలు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఏప్రిల్ 5 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం చింతలూరు గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ వేద మంత్రోచ్చారణాల మధ్య జలాధివాసం, ధాన్యాదివాసం, వస్త్రాదివాసం, పుష్పాదివాసం, హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి యంత్ర ప్రతిష్ఠ చేసి ధ్వజస్తంభం ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అనుపురం శ్రీనివాస్ గౌడ్, దేవాలయ కమిటీ చైర్మన్ ఓరుగంటి భూమారావు , అర్చకులు శ్రీనివాస్, గ్రామ నాయకులు కొత్త వెంకటి, అను పురం గంగాధర్, ముద్దం రమేష్, మక్కల సాయికుమార్, అల్లాల అంజిత్, రమణయ్య, అనుపురం సత్యం, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ రైతుగా ఎన్నికైన బొజ్జ దేవేందర్ రావుకు ఘనంగా సన్మానం

వార్త మిర్రర్ రాయికల్ (శంకర్ తిరుమల) ఏప్రిల్ 5

ఉత్తర తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన మరియు విస్తరణ సలహా సంఘ%శీ% ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన రైతులను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వావిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. 2024-25 లో జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి బొజ్జ దేవేందర్ రావు అనే రైతు వ్యవసాయ శాఖ, మరియు వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారుల సూచనల మేరకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాడు. అందులో భాగంగా దేవేందర్ రావు ను ఉత్తమ రైతుగా ఎంపీక చేసినారు. ఈ సందర్బంగా దేవేందర్ రావు ను వ్యవసాయ శాస్త్రవేత్తల చేతుల మీదుగా మెమోంటో, ఉత్తమ ప్రతిభా పత్రం ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి, వ్యవసాయ విశ్వావిద్యాలయ శాస్త్రవేత్తలు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# కష్టాల్లోనూ తోడున్న స్నేహితులు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఏప్రిల్ 5

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన 2002-03 సంవత్సరానికి చెందిన పదవ తరగతి స్నేహితులు అదే గ్రామానికి చెందిన తోటి స్నేహితుడైన రామస్వామీ తల్లి అనారోగ్యం వల్ల మరణించడంతో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలిసిన సోమ రమేష్ రెడ్డి, తీగల జగదీశ్వర్ రెడ్డి, ఎల్లాల చంద్రశేఖర్ రెడ్డి, కటకం రంజిత్ కుమార్ కలిసి తోటి స్నేహితుల వద్ద విరాళాలు జమచేసి 32 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి ఎలాంటి ఇబ్బందులు కలిగిన ఆదుకుంటామన్న భరోసాని ఇచ్చారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ స్నేహితులనేవారు ఆటల్లో, పాటల్లో సంతోషకరమైన విషయాలలోనే కాకుండా కష్టకాలంలో ఆ పరిస్థితి నుండి వారిని బయటకి తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని సూచించారు.



# వక్ఫ్ బిల్లు చారిత్రాత్మక మలుపు

## - మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం

కల్వకుర్తి ఏప్రిల్ 5 వార్త మిర్రర్ ప్రతినిధి:- పార్లమెంటులో వక్ఫ్ బోర్డ్ బిల్లు ఆమోదించడం చిరస్మరణీయం కల్వకుర్తి మండలం లో మహబూబ్ నగర్ చౌరస్తా వద్ద భారత ప్రధాని శ్రీనరేంద్ర మోడీ చిత్రపటానికి బిజెపి నాయకులు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా వక్ఫ్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారితనం లోపించాయి. ముఖ్యంగా ముస్లిం మహిళలు పేద ముస్లిం ప్రయోజనాలను దెబ్బతీసింది. ఇప్పుడు పార్లమెంట్ ఆమోదం లభించడంతో వారి హక్కులకు భద్రత లభించినట్లుయింది. ఈ బిల్లుతో ఇప్పుడు సామాజిక న్యాయం జరిగే ఓ ఆధునిక యుగంలోకి మనం ప్రవేశిస్తున్నామన్నారు. ఉన్నత వర్గాల చేతిలో చిక్కుకున్న భూములను పేద ముస్లింలకు దక్కేల ఈ బిల్లు కృషి చేస్తుందని చెప్పారు. అదే విధంగా బిల్లుకు వ్యతిరేకంగా కొందరు శుక్రవారం ర్యాలీ నిర్వహించిన ముస్లిం జేఏసీ ర్యాలీలో కొందరు ముష్కరులు హిందుస్థాన్ ముర్దాబాద్ అంటూ భారత ప్రధాని నరేంద్ర మోడీ గారిని తీవ్రమైన పదజాలంతో దూషిస్తూ, వివిధ పదజాలాలతో తిడుతూ భారత రాజ్యాంగం కల్పించిన నిరసన ర్యాలీ హక్కుని కాలరాయడమే కాకుండా దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నందుకు సుమోటోగా కేసు నమోదు చేయాలని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి డి.ఎస్.పి వెంకటేశ్వర్లుకి భారతీయ జనతా పార్టీ కల్వకుర్తి శాఖ ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపాలిటీ మరియు రూరల్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## కులం చేతనే ప్రధానమంత్రి పదవి డా, బాబు జగ్జీవన్ రామ్ కు దక్కలేదు- రెడ్ స్టార్ సుక్క రామ్ నరసయ్య




యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి సందర్భంగా రెడ్ స్టార్ సింగర్ సుక్క రామ్ నరసయ్య మాట్లాడుతూ డా, బాబు జగ్జీవన్ రామ్ దేశ స్వాతంత్ర్యం కోసం సామాజిక సమానత్వం కోసం అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని సమరం సాగించిన రాజకీయ దూరందరుడు అని. జీవిత కాలం ఓటమి ఎరుగని ధీరుడు అని నెహ్రూ కేబినెట్లోనే బెబి మినిస్టర్ గా రాజ్యాంగ పరిషత్తు సభ్యుడు గా 50 ఏండ్ల పార్లమెంటేరియన్ అని. 30 ఏండ్ల కేబినెట్ మినిష్టర్ అని ఆయన మినిష్టర్ గా పని చేసిన కాలంలో అనేక సంస్కరణలకు, విప్లవాత్మక మార్పులకు, యుద్ధ మెలుకువలకు కేంద్రబిందువు గా నిలిచాడని అట్టడుగు కులంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగిన రాజకీయ చాణిక్యుడు, సామాజిక న్యాయ స్వాప్నికుడు మన బాబుజీ అని బీజే ఆర్ అంటేనే ఓ చరిత్ర అని అన్నారు. బాబుజీ ఆమహాయోధున్ని స్మరిస్తూ తెలంగాణ ప్రజలందరికీ వారి జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం అని అన్నారు. జగ్జీవన్ రామ్ గారికి భారత రత్న ఇవ్వాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు



## విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం:నోముల జంగిరెడ్డి

సెరినిటీ స్కూల్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రధానం కాప్రా,వార్త మిర్రర్,ఏప్రిల్ 5:విద్యతో పాటు విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి,విద్య అంటే కేవలం పుస్తకాల చదువు మాత్రమే కాదు,మంచి ప్రవర్తన,సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా తీర్చిదిద్దడం కూడా విద్యావ్యవస్థ లక్ష్యం అని సెరినిటీ స్కూల్ స్పెషల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అన్నారు.నాగారం సెరినిటీ మోడల్ హైస్కూల్లో ఐఐటి ఫౌండేషన్ పరీక్షల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన ఆరు, ఏడు,ఎనిమిది,తొమ్మిది తరగతుల విద్యార్థిని,విద్యార్థులను సన్మానించారు. స్కూల్ స్పెషల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి,ముఖ్య కార్యదర్శి నోముల వసంత రెడ్డి విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందించారు.ఈ సందర్భంగా జంగిరెడ్డి మాట్లాడుతూ సెరినిటీ స్కూల్ నుండి ఎంతో మంది విద్యార్థులు వెలుగులోకి వచ్చారని గుర్తు చేస్తూ విద్యలో మంచి జ్ఞానం పెంపొందించడం,అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు.సెరినిటీ స్కూల్ విద్యతో పాటు ఆటల పోటీలు,యోగా,వ్యాసరచన వంటి రంగాలలోనూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తోంది.వారి సమగ్ర అభివృద్ధి మా లక్ష్యం అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుబ్బారావు,ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.



## జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిట్యాల భూమయ్య ఎన్నిక

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఏప్రిల్ 5 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన చిట్యాల భూమయ్య జగిత్యాల రూరల్ మండలం రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ భూమయ్య తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన చిట్యాల భూమయ్యను అభినందించారు. ఈ సందర్భంగా మేధావులు, విద్యావేత్తలు, రాజకీయ నాయకులు, అల్లీపూర్ గ్రామస్తులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ చిట్యాల భూమయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.



## దావన్ పెల్లి లో ఆంజనేయ స్వామి కి రజిత పాదుకల సమర్పణ

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఏప్రిల్ 5

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం దావన్ పల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామి వారికి మాలావత్ వెంకటేష్ దంపతులు శనివారం రజిత పాదుకలు సమర్పించారు. ఈ సందర్భంగా పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధృడసంకల్పం జపం, యోగసాధన, ఆహార నియమాలు, సద్గురువు బోధనలు పాటించడం వలన సకల శుభాలు కలుగుతాయని పురాణాలు చెపుతున్నాయని చెరుకు మహేశ్వర శర్మ వివరించారు. అనంతరం దీక్షా స్వాములకు భిక్ష అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గోవిందుల శ్రీనివాస్, కట్కాపూర్, దావన్ పెల్లి ఆంజనేయస్వామి మాలధారణ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



## పలు ప్రభుత్వ కార్యాలయంలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

మిర్యాలగూడ, ఏప్రిల్ 5:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం, పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో మాజీ ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సబ్ కలెక్టరేట్ లో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు హరిబాబు, సురేష్, జవహర్లాల్, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్.హరిబాబు, సిబ్బంది మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.శేషగిరిశర్మ, సూపరింటెండెంట్ పి. కరుణాకర్ రావు, మునిసిపాలిటిలో కమిషనర్ ఎండీ.యూసుఫ్, డిఇఇ వెంకన్న, ఆర్ఓ జి.జ్ఞానేశ్వరీ, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, టిపిఎస్ అంజయ్య జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## తాటికోల్ లో సన్న బియ్యం పంపిణీ చేసిన జూలూరి ధనలక్ష్మి బాల నారాయణ గౌడ్

దేవరకొండ ఏప్రిల్ 05 వార్త మిర్రర్ :భారత దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ పథకం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం అని తాటికోల్ గ్రామ మాజీ సర్పంచ్ రాష్ట్ర సర్పంచుల ఫోరం మహిళా అధ్యక్షురాలు, భారత్ జోడో యాత్రీ జూలూరి ధనలక్ష్మి బాల నారాయణ గౌడ్ అన్నారు. దేవరకొండ మండలం తాటికోల్ గ్రామంలో శనివారం ప్రభుత్వ చౌక ధరల దుకాణం ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసే సన్న బియ్యాన్ని జూలూరి ధనలక్ష్మి బాల నారాయణ గౌడ్ ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో సన్న బియ్యం పంపిణీ పథకం లేకపోయినా బడుగు బలహీన వర్గాల పేద ప్రజల ఆకలి నీ తీర్చడం కోసం వారికి కడుపునిండా భోజనం అందించాలన్న తలంపుతో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అవేమీ ఆలోచించకుండా సన్న బియ్యం పథకాన్ని అమలు చేయడం గర్వించదగ్గ విషయం అని ఆమె అన్నారు. మేనిఫెస్టోలో అమలు చేసిన ఆరు పథకాలను ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒక్కొక్కటి అమలు చేయడానికి ప్రభుత్వం ముందు చూపుతో ఉన్నదనీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మాజీ ఎంపీటీసీ ఉత్తరమ్మ, మాజీ ఎంపిటిసి జూలూరు అంజయ్య, పబ్బు వెంకటేశ్, జూలూరి అంజయ్య, జూలూరి గిరిప్రసాద్, హనుమంత్ నగేష్, ఎల్ఐసి శ్రీనయ్య బజారు సత్తయ్య,కనకచారి సామల



యాదయ్య, ఎరుకల యాదగిరి తోటపల్లి రాములు, గ్రామ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.




## సేంద్రీయ వ్యవసాయ సాగు శిక్షణ లో ఇటిక్యాల వాసి

### - రైతుల ఒత్తిడితగ్గించేందుకు యోగ

### - రాజస్థాన్ లో తెలంగాణ ప్రభుత్వం చే ప్రత్యేక శిక్షణ

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఏప్రిల్ 5

రైతు పంటను పండించేటప్పుడు అనేక కష్టనష్టాలవోర్చి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నరైతులలో ఆత్మస్థైర్యం పెంచి లాభసాటి వ్యవసాయం చేసేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలకు తెలంగాణప్రభుత్వం అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలకు జగిత్యాల జిల్లా నుండి రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన రైతు గడ్డం రాజేందర్ రెడ్డి ని ఎంపిక చేయగా ఆయన ప్రస్తుతం రాజస్థాన్ మౌంట్ అబ్ లో శిక్షణ పొందుతున్నారు. ఇట్టి సందర్భంగా ఆయన చరవాణి ద్వార మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం తో రైతులకు లాభసాటి పంటను చూపిస్తూ రైతుల రోజువారి శ్రమలో ఒత్తిళ్లను తట్టుకునేందుకు ప్రత్యేక యోగా శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.



## నాయొక్క భూమి కబ్జా చేయటకు ప్రయత్నిస్తున్నారు ఎస్పీ కి వినతి పత్రం అందజేసిన సుధవేణి బాలరాజు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్)ఏప్రిల్ 5

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణనికి చెందిన బాలరాజు కల్లుగీస్తూ జీవిస్తాడు. రాయికల్ పట్టణనికి చెందిన వారి వద్ద నుండి 2011 సంవత్సరంలో డిస్మెంటల్ హౌస్ నెంబర్ 15-62 గల విస్తీర్ణం 300 .60 చదరపు గజాల భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. చుట్టూ హద్దు రాళ్ళు కూడాపెట్టుకున్నాడు. రాయికల్ గ్రమానికి చెందిన కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు నా యొక్క సొంత భూమి కబ్జా చేయటకు ప్రయత్నిస్తున్నారు. గౌరవ న్యాయస్థానంలో కేసు వేసి ఇంజక్షన్ ఆర్డర్ కూడా పొంది ఉన్నడు. ఇది ఇలా ఉండగా అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులందరూ నా యొక్క సొంత భూములుగా అక్రమంగా దౌర్జన్యంగా ప్రవేశించి నా యొక్క హద్దులు కనులు విరగొట్టి అందులో ఉన్న రేకుల షెడ్ మరియు కరెంటు మీటర్లు సీసీ కెమెరాలను దొంగిలించారు. 90 వేల ఆస్తి నష్టం కలిగించారు అనిజగిత్యాల ఎస్ పి ని కలిసి వినతి పత్రం సమర్పించారు...



## దళితుల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్

మందమర్రి ఏప్రిల్ 5: వార్త మిర్రర్ ప్రతినిధి దళితుల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలు పట్టణంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లెదర్ పార్క్ ఆవరణలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దళిత సంఘాల నాయకులు తుంగపిండి రాజేష్ కుమార్ మాట్లాడుతూ 30 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా పదవులు నిర్వహించిన మొట్టమొదటి వ్యక్తి భారతదేశంలో బాబు జగ్జీవన్ రామ్ అని ఆన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీకి సపోర్ట్ చేసినప్పటికి, 1977లో జనతా పార్టీలో చేరి భారతదేశం ఉప ప్రధానిగా 1977 నుండి 1979 వరకు కొనసాగారన్నారు.భారతదేశంలో అనేక మంత్రీ పదవులు నిర్వహించిన వ్యక్తి జగ్జీవన్ రామ్ అని ఆయన సేవలను కొనియాడారు. ఆయన జీవిత చరిత్ర ప్రతి ఒక్కరు చదివి ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి అణగారిన వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేన నాయకులు నోముల దుర్గాప్రసాద్, రాము, లెదర్ పార్క్ అధ్యక్షులు కొలుగురి విజయకుమార్, సదా సేవ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సంగి సంతోష్, ఉప్పులేటి నరేష్, నాయకులు బచ్చలి భీమయ్య సోమవారపు సామిల్, దరిపెల్లి కనకయ్య, కొలుగురి పృథ్వి రాజ్, కాంగ్రెస్ నాయకులు బత్తుల సరిత, బొడ్డు వినోద, ధరిపెల్లి సరూప రాణి, దాసరి సరిత, కాంపల్లి లక్ష్మి లు పాల్గొన్నారు



## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 5

స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త, రాజకీయవేత్త, మాజీ ఉపప్రధాని స్వర్గీయ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శనివారం రోజు పురపాలక సంఘం, రాయికల్ నందు మునిసిపల్ కమీషనర్ ఆధ్వర్యంలో నిర్వహించనైనది. ఈ కార్యక్రమంలో కమీషనర్ టి.మనోహర్, హెల్త్ అసిస్టెంట్ సురేష్, జూ.అసిస్టెంట్ హరీష్, రాజ్ కుమార్, ఫయజ్, బిల్ కలెక్టర్ నరేష్, సుదర్శన్, మునిసిపల్ సిబ్బంది పాల్గొని నివాళులు అర్పించారు.

ఇటిక్యాల లలోరాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకకాకతీయ యూనివర్సిటీ మాజీ ప్రొపెసర్ శ్రీ కొడిమ్యాల భూంరావ్ సమక్షంలో అంబెడ్కర్ యువజన సంగం అధ్యక్షులు శ్రీ నీగ భూమేశ్వర్ ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన సంగం ఉపాధ్యక్షుడు గంగాధర్, క్యాషియర్ రాజాం, కార్యదర్శి శంకర్, సంఘ సభ్యులు కొండయ్య, లక్ష్మిరాజం, రాకేష్, దశికుమార్, శేఖర్, శ్రీధర్, శ్రీనివాస్, అజయ్, రాజు పాల్గొన్నారు.మైతపూర్ లోమండలం లోని మైతపూర్ గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



## సూర్యతేజ రా అండ్ బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్ నిత్యం రైతులకు అన్నప్రసాద వితరణ

### రైస్ మిల్లర్లు మురళిని ఆదర్శంగా తీసుకోవాలి

మిర్యాలగూడ ఏప్రిల్ 5:-( వార్త మిర్రర్)ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు ధాన్యాన్ని అమ్మే సమయంలో మెరుగైన సౌకర్యాలు, తమ వంతు చేయూత అందించేందుకు గాను మిర్యాలగూడ మండలం బాదలాపురం గ్రామ శివారులోనీ సూర్యతేజ రా అండ్ బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం జయిని మురళి ఆధ్వర్యంలో మిల్లుకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు గత 15 రోజులుగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టించి పండించిన రైతులకు ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని తాగునీటి, అన్నవితరణ గత కొన్నేండ్లుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సీజన్ లో రైతులకు ఇబ్బంది కలగకుండా పలు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సామాజిక సేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆ దిశగా దేశానికి అన్నం పెట్టే రైతులను ఆదుకోవడంలో ముందుండాలన్నారు. జయిని మురళిని స్ఫూర్తిగా తీసుకొని శెట్టిపాలెం, అవంతిపురం, గూడూరు, సాగర్ రోడ్డు, శ్రీనివాస్ నగర్ లలోని రైస్ మిల్లుల యాజమాన్యాలు ఇదే తరహాలో రైతులకు అన్న వితరణ నిర్వహించాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు. కార్యక్రమంలో మిల్లర్లు పైడిమర్రి రంగనాథ్, పైడిమర్రి సురేష్, జయిని ప్రకాశ్, సతీష్, శ్రీరాంరెడ్డి, విజయ్రెడ్డి పాల్గొన్నారు.



## పంపుసెట్ అందించిన కొట్టే సంపత్ పటేల్

మందమర్రి ఏప్రిల్ 5: వార్త మిర్రర్ ప్రతినిధి

మండలంలోని గుడిపల్లి వెంకటాపూర్ గ్రామంలో తన తండ్రి కొట్టే రాజయ్య పటేల్ జ్ఞాపకార్థం, చిన్న కుమారుడు కొట్టే విహాన్ కుమార్ జన్మదినం సందర్భంగా గ్రామానికి చెందిన కొట్టే సంపత్ కుమార్ పటేల్ ప్రజల సౌకర్యార్థం చేతి పంపు కు పంపు సెట్ ను విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతిపంపు ద్వారా ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు తన కుమారుని జన్మదినం సందర్భంగా తన తండ్రి జ్ఞాపకార్థం పంపు సెట్ ను అందజేయడం జరిగిందని తెలిపారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు తనకున్నంతలో సహాయం చేసేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఈ సందర్భంగాగ్రామస్తులుఆయననుఅభినందించారు.ఈకార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా మహనీయ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు..





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఏప్రిల్ 05

సమత వాది మాజీ ఉప ప్రధాని మాహనీయ డా,, బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలను అంబేద్కర్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్ మండల కమిటీ, ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ 1908 ఏప్రిల్ 5 న బీహార్‌లోని చాంద్వాలో దళిత కుటుంబంలో జన్మించిన జగ్జీవన్ రామ్ ప్రారంభ జీవితం విద్య ను సమీపంలోని అర్రా పట్టణంలో తన పాఠశాల విద్యను అభ్యసించాడు, అక్కడ అతను మొదటిసారిగా వివక్షను ఎదుర్కొన్నాడు.అతను 'అంటరానివాడు'గా పరిగణించబడ్డాడు వేరే కుండ నుండి నీరు త్రాగవలసి వచ్చింది.దీనిపై జగ్జీవన్ రామ్ కుండ బద్దలు కొట్టి నిరసన తెలిపారు. దీంతో ప్రిన్సిపాల్ పాఠశాల నుంచి ప్రత్యేక కుండను తొలగించాల్సి వచ్చింది అని,జగ్జీవన్ రామ్ పండిట్ మదన్ మోహన్ మాలవ్యను కలుసుకుని బనారస్ హిందూ యూనివర్సిటీలో చేరగా అక్కడ కూడా వివక్షను ఎదుర్కొన్నారు. ఇది సమాజంలోని ఒక వర్గం యొక్క ఇటువంటి సామాజిక బహిష్కరణలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేయడానికి అన్యాయానికి వ్యతిరేకంగా అతను షెడ్యూల్డ్ కులాలను కూడా సంఘటితం చేశాడు.కలకత్తా విశ్వవిద్యాలయంలో చేరి డిగ్రీ పొందిన జగ్జీవన్ రామ్ అనేక రవిదాస్ సమ్మేళనాలను కలకత్తా (కోల్‌కతా)లోని వివిధ ప్రాంతాలలో గురు రవిదాస్ జయంతిని జరిపి సమాజం లో చైతన్యం కోసం పరితపించే వాడని 1931 లో భారత జాతీయ కాంగ్రెస్ (కాంగ్రెస్ పార్టీ) సభ్యుడు అయ్యాడని 1934-35లో అంటరానివారికి సమానత్వం సాధించడానికి అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ యొక్క స్థాపనలో కీలక పాత్ర పోషించాడని సామాజిక సమానత్వం మరియు అణగారిన వర్గాలకు సమాన హక్కుల కోసం పోరాడాడు.1935లో, ఆయన హిందూ మహాసభలో తాగునీటి బావులు మరియు దేవాలయాలు అంటరానివారికి తెరిచి ఉంచాలని ప్రతిపాదించారు .1935లో, బాబూజీ రాంచీలోని హమ్మండ్ కమీషన్ ముందు కూడా హాజరయ్యాడు మరియు దళితులకు ఓటు హక్కును మొదటిసారిగా డిమాండ్ చేశాడు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమంతో సంబంధం ఉన్న తన రాజకీయ కార్యకలాపాలకు 1940ల ప్రారంభంలో అతను రెండుసార్లు జైలు పాలయ్యాడు.స్వాతంత్ర్యానంతరం జవహర్‌లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, జగ్జీవన్ రామ్ దాని అతి పిన్న వయస్కుడైన మంత్రి అయ్యాడు.స్వాతంత్ర్యం తరువాత అతను 1952 వరకు లేబర్ పోర్ట్‌ఫోలియోను కలిగి ఉన్నాడు . ఆ తర్వాత అతను నెహ్రూ క్యాబినెట్‌లో కమ్యూనికేషన్స్ (1952-56), రవాణా మరియు రైల్వేలు (1956-62), రవాణా మరియు సమాచార (1962-63) మంత్రి పదవుల్లో పనిచేశాడు .అతను ఆహారం మరియు వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశాడు (1967-70), మరియు 1970లో అతను రక్షణ మంత్రి అయ్యాడు.ఆయన రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు 1971లో భారత్-పాకిస్థాన్ యుద్ధం జరిగింది .అతను 1977లో కాంగ్రెస్‌ను విడిచిపెట్టి , తన కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ (కొత్త పార్టీ)తో పాటు జనతా పార్టీ కూటమిలో చేరాడు. తరువాత అతను భారతదేశం యొక్క ఉప ప్రధాన మంత్రిగా పనిచేశాడు (1977-79).జగ్జీవన్ రామ్ 1936 నుండి 1986 వరకు (40 సంవత్సరాలు) నిరంతరాయంగా పార్లమెంటు సభ్యుడు మరియు ఇది ప్రపంచ రికార్డు.భారతదేశంలో అత్యధిక కాలం (30 ఏళ్లు) కేబినెట్ మంత్రిగా పనిచేసిన వ్యక్తిగా కూడా ఆయన మరో రికార్డును సొంతం చేసుకున్నారు అని జులై 6, 1986న న్యూఢిల్లీలో మరణించాడని అతని దహన సంస్కార స్థలంలో అతని స్మారకానికి సమతా స్థల్ (సమానత్వం యొక్క ప్రదేశం) అని పేరు పెట్టారని ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఆ మహనీయుడు కలలు గన్న సమ సమాజ స్థాపనకు సబ్బండ వర్గాలైన యస్సి, యస్ టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదాలంత చైతన్యం తో ఏకమై ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొరగోని లింగస్వామి, బోదుల నర్సింహా, ఆరుట్ల యాదయ్య, బోదుల బిక్షపతి, బోయ రామచంద్రం, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొడ్డు శ్రావణ్ కుమార్,సుక్క సుదర్శన్, చింతల సాయిలు, బక్క శ్రీనాథ్, ఊదరి వెంకటేష్,మేడి యాదయ్య, బోయ రాము, పురు శంకర్, ఆరుట్ల లింగస్వామి, బోదుల లింగస్వామి, పురు నరేష్, ఆరుట్ల శేఖర్, ఉదరి రాకేష్, తదితరులు పాల్గొన్నారు..

# శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో కళ్యాణ వేడుకలు.


వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఏప్రిల్ 05శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో కమిటీ ఆధ్వర్యంలో శ్రీరాముని కళ్యాణం ఉత్సవంలో భాగంగా దేవాలయంలో మూలవిరాట్లకు పంచామృత అభిషేకములు గణపతి పూజ స్వస్తి పుణ్యాహవాచనం నవగ్రహమంటపారాధన ధ్వజ రోహణ కార్యక్రమం వేద పండితులచే నిర్వహించడం జరిగింది. దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళమురళి మాట్లాడుతూ రేపు ఉదయం11:00 గంటలకు చౌటుప్పల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి పెద్ద ఎత్తున భక్తులు రావాలని సుమారు పదివేల మందికి భోజనం మరియు సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు.వేసవిని దృష్టిలో పెట్టుకొని భక్తులకు దాతల సహకారంతో మంచినీరు మజ్జిగ ఇవ్వడానికి ఏర్పాట్లు చేశామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళమురళి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు సంధ్యా దంపతులు, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, ధర్మకర్తలు కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, గుర్రం వెంకటేశం, వర్కాల వెన్నెల రవి గౌడ్, తూర్పాటి నరసింహ, సుర్వి నర్సింహా గౌడ్ మోగుదాల రమేష్ గౌడ్, గుజ్జుల సురేందర్ రెడ్డి మంచి కంటి భాస్కర్ గుప్తా, దాచేపల్లి ప్రకాష్, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, బోడిగ బాలకృష్ణ గౌడ్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి,సీనియర్ పాత్రికేయులు సామిడి రాఘవ రెడ్డి,ఉడుగు మల్లేష్ గౌడ్, కామిశెట్టి శైలజ భాస్కర్, సంద గళ్ళ విజయ సతీష్ గౌడ్ బాల్యం వెంకటాచలపతి, తాడూరి పరమేశ, మునుకుంట్ల జంగయ్య గౌడ్ పాశం రామాంజనేయులు, బొబ్బిళ్ళ రాజేందర్ బొబ్బిళ్ళ కాళేశ్వర్, దాడి సురేందర్ రెడ్డి నల్ల పర్వతాలు యాదవ్, వనం ధనుంజయ, బడుగు శ్రీరాములు బడుగు బాలరాజు గోశిక బాల నరసింహ,గోశిక రవి, గోశిక నరసింహ, వేద పండితులు శ్రీ పెద్ది సుధాకర్ శర్మ శ్రీ పెద్ది కిషోర్ శర్మ రోహిత్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



## తార్నాక శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో ఘనంగా సాయిబాబా 21 వార్షికోత్సవ వేడుకలు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 5... తార్నాక చౌరస్తా లోని శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం లో శనివారం సాయిబాబా దేవాలయ 21 వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు సాయి వ్రతాలు, విశేష అభిషేకం, అలంకరణ, అర్చనలు వంటి కార్యక్రమాలను కన్నుల పండుగగా నిర్వహించారు. పూజల అనంతరం వందలాదిమందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులతో పాటు వందలాదిగా భక్తులు పాల్గొన్నారు.



## బాలాపూర్ ఎక్స్ రోడ్లో డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( సంగిశెట్టి ధనుంజయ్ నేత ) ..ఏప్రిల్ : 5 ...

మహేశ్వర నియోజకవర్గం బాలాపూర్ మండల్ మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ ఎక్స్ రోడ్లో డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ జయంతి ఉత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఎం ఆర్ పి ఎస్ బాలాపూర్ మండల్ ఇన్చార్జి తొట్ల శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ వివక్షలు ఎదుర్కొంటున్న కులంలో నుండి స్వతంత్ర పోరాటం లోనూ, రాజకీయాల్లోనూ రాణించి..ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా గాంధీ నే ఎదిరించి,సొంత రాజకీయ పార్టీ పెట్టి విజయం సాధించి ఒక ధిక్కార స్వరం..వ్యవసాయ శాఖ మంత్రి గా రైల్వే మంత్రి గారక్షణ మంత్రి గా దేశానికి.కుల మతాలకు అతీతంగా సేవలు అందించారు పదేళ్ళకే కేటాయించిన ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్లు ను నేటివరకు కొనసాగించటానికి కారకుడు బాబూజీ దండోరా ఉద్యమం తరువాత దేశం గుర్తించింది,అలాంటి మహోన్నత వ్యక్తిని దండోరా ఉద్యమం దేశం మొత్తం తెలిసేలా చేసింది..జోహార్! బాబు జగ్జీవన్ రామ్ ఈ కార్యక్రమం లో ఎమ్మార్పీ బాలాపూర్ మండల్ కమిటీ బిజెఆర్ బాబు జగ్జీవన్ రావ్ కమిటీ అసోసియేషన్ బాలాపూర్ మండల్ కమిటీముచ్చర్ల ఆనంద్ మాదిగ పుల్లన్న మాదిగఆలంపల్లి అంజయ్య మాదిగ జిల్లా విజయ్ కుమార్ మాదిగ డీకే నరసింహ మాదిగజనార్ధన్ మాదిగ గుద్దేటి నరసింహ మాదిగకంబాలపల్లి శ్రీనివాస్ మాదిగ ముచ్చర్ల శ్రావణ్ మాదిగ కండ్లపల్లి నరేందర్ మాదిగపరశురాం మాదిగ శ్యామ్ మాదిగజిల్లా వెంకటేష్ మాదిగ ఎరుకల్ సుధాకర్ సిహెచ్ కృష్ణ మాదిగ కిషన్ చారి సిహెచ్ వెంకటేష్ మాదిగ వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు



## మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలుచెల్లించాలి

### తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఏప్రిల్ 5

శుక్రవారం రోజున పై డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జగిత్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యములో జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సెక్షన్ అధికారి కి ఈ నెల ఏప్రిల్ 19 నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె లోకి వెళ్తున్నామని సమ్మెనోటిస్ ఇవ్వడం జరిగింది. మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, జీ వో, నెంబర్ 51 సవరించాలి, పాత పద్ధతిలోనే కేటగిరీల వారీగా విధులు నిర్వహించాలి, ఆన్ లైన్ లో పేర్లు నమోదు కానీ వారి పేర్లు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా ప్రభుత్వమే ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో గ్రామ పంచాయతీ సిబ్బందికి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలని, ఈ వేతనాలకు ప్రభుత్వం వేతనాలు కై ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలి, పర్మినెంట్ చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు. చేయాలని, ఇన్సూరెన్స్ భీమా అమలు చేయాలని, ఈ,యస్, ఐ,, పి, ఎఫ్, అమలు చేయాలని వయసు మీరిన వారి కుటుంబములో, మరియు ఛని పోయినా వారి కుటుంబములో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఈ పలు డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సీఐటీయూ రాష్ట్ర నాయకత్వం తో చర్చలు జరిపి ఈ నెల 18 వ తేది లోపు పరిష్కారం కొరకు చొరవ తీసుకోవాలని, ఒక వేళ సమస్యల పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే తప్పకుండా రాష్ట్ర పిలుపు మేరకు నిరవధిక సమ్మె లోకి వెళు న్నామని సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. అసలే ఇది వేసవి కాలం మంచినీటి, సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాలు, చెత్త సేకరణ, ఆఫీస్ పనులు, నిలిచిపోతాయి. కావున ప్రజలకు అందుబాటులో ఉండే ఈ సిబ్బంది సమ్మెలోకి వెళ్తే ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత. కావున పదహారు నెలలు వేసి వేసి నిరీక్షించి చివరికి శాంతియుతంగా ఉన్న ఈ సిబ్బంది సమ్మెలోకి వెళ్లకుండా తక్షణమే రాష్ట్ర నాయకత్వము తో చర్చలు జరపాలి, సీఐటీయూ జగిత్యాల జిల్లా కన్వీనర్ పుప్పాల శ్రీకాంత్, సులోచన , ఎం, ఏ, చౌదరి, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోమటి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి పులి మల్లేశం, జంగిలి ఎల్లయ్య, సాతల్లా రాజేందర్, తిరుపతి ,రాజన్న, రాజు, అంజన్న, లచ్చన్న, రాజేశం, భూమయ్య, సత్యం, పాల్గొన్నారు.



## బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలో పాల్గొన్న టిడిపి ఇన్చార్జి వల్లారపు శ్రీనివాస్

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 5 ...సీతాఫల్మండిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద "బాబు జగ్జీవన్ రామ్" 117వ జయంతి కార్యక్రమం సీతాఫల్మండి ఎస్ సీ, ఎస్ టి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదుల్లో ఒకరిగా తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ విచ్చేసి బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమములో సీతాఫల్మండి ఎస్ సీ, ఎస్ టి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్, తెదేపా సీతాఫల్మండి డివిజన్ అధ్యక్షుడు, సీతాఫల్మండి ఎస్ సీ, ఎస్ టి వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి వి క్రిష్ణ, విద్యాసాగర్, గడ్డం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ గిరి, తెదేపా సీనియర్ నాయకురాలు శేషిరేఖ, సీనియర్ నాయకులు చిరంజీవిరాజు, వెంకటస్వామి, శంకర్ ముదిరాజ్, చందర్ ముదిరాజ్, మురళి క్రిష్ణ, చంద్రమోహన్, పుప్పాల విజయ్, టెంట్ హౌస్ శంకర్, అశోక్, సాయి మరియు పెద్దఎత్తున సంబంధిత అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.అంతకుముందు స్థానిక బీదల బస్తీ నుండి సీతాఫల్మండి కూడలి వరకు సంబంధిత అసోసియేషన్ వారు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు.




## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

### మహనీయుల ఆశయాల అమృత ధారగా మారాలి %-% సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( సంగిశెట్టి ధనుంజయ్ నేత ) ..ఏప్రిల్ : 5 ...

"బాబూ జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల ఆశయాలు, చాటించిన మార్గదర్శకత్వం నేటి సమాజానికి అతి ముఖ్యమైన మార్గదర్శనం" అని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, దీవెనలు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో అన్యాయానికి, అసమానతలకు ఎదురుగా నిలబడి, సామాజిక న్యాయం సాధనకు జీవితాంతం పోరాడిన బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం. మనం ఆయన ఆశయాలకోసం కృషి చేయాలి. అందరికి సమాన హక్కులు, అవకాశాలు కలిగే సమాజం నెలకొల్పడమే ఆయనకు నిజమైన నివాళి" అన్నారు.ఈ కార్యక్రమంలో మీర్పేట్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లకు చెందిన పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## దళిత హక్కులను కాపాడుతూ బడుగుల కోసం నిరంతరం పోరాడిన మహానేత బాబు జగ్జీవన్ రామ్.. డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 5.. బడుగు బలహీన వర్గాల కు న్యాయం చేసే విధంగా పాలన అందించిన గొప్ప పరిపాలన అధ్యక్షుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి టీటీడీసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డి డివిజన్లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో పాల్గొని వారి విగ్రహాలకు చిత్రపటాలకు ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎమ్మార్. ప్రవీణ్ కుమార్ తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## డ్రగ్స్,గంజాయి, ఆన్లైన్ బెట్టింగ్, వ్యామోహాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు..

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఏప్రిల్ 05డివైఎఫ్ఐ జిల్లా వ్యాప్త సమరభేరి సైకిల్ యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ చౌటుప్పల్ మండల కేంద్రంలో ఏసిపి పట్టోళ్ల మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మధ కుమార్ చేతుల మీదుగా వాల్ ఈపోస్టర్ విడుదల చేయడం జరిగింది.తనంతరం ఏసీపీ మధుసూదన్ రెడ్డి,సిఐ మన్మధ కుమార్ కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ గంజాయి ఆన్లైన్ బెట్టింగ్ వ్యామోహాలకు బానిసలై జీవితాలను బలి చేసుకుంటున్నారని అన్నారు.యువత కుటుంబాలకు అండగా నిలబడాల్సిన సమయంలో రకరకాల పేడ ధోరణలతో జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఈ సమయంలో డివైఎఫ్ఐ యువజన సంఘం గంజాయి డ్రగ్స్ నిర్మూలించాలని సైకిల్ యాత్ర నిర్వహించడం యువతను చైతన్యపరిచేందుకు ఉపయోగపడుతుందని ఈనెల14 న నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో ప్రారంభమై 20వ తేదీన రామన్నపేటలో ముగుస్తుందని అన్నారు.డివైఎఫ్ఐ సమర బేరి సైకిల్ యాత్ర కార్యక్రమానికి పోలీస్ వ్యవస్థ కూడా సహకరిస్తుందని అన్నారు. గంజాయి డ్రగ్స్ ను నిర్మూలించేందుకు అందరు సహకరించాలని ఎక్కడైనా ప్రోత్సహిస్తే కఠినమైన చట్టాలు అమలు చేస్తామని అన్నారు.పోస్టర్ విడుదల చేసిన వారిలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధు కృష్ణ, మండల అధ్యక్షులు బోధస్ నరేష్, ఏఎస్ఐ యాదవ రెడ్డి, నాయకులు గండని లక్ష్మీపతి,నత్తి నరేష్, దాసరి ప్రకాష్, యానాల రాజశేఖర్ రెడ్డి, ఎలక రాజు మహేష్ బొమ్మ కంటి వెంకన్న, మల్కాపురం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు